నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, మంగళవారం 24 డిసెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న అప్పటి తెలంగాణ, ఒడిశా ఆర్టీసీ ఉన్నతాధికారులు(ఫైల్)

కేసీఆర్ సర్కారుకు క్రెడిట్ దక్కకుండా..

- భద్రాచలంలో ఆర్టీసీ అంతర్రాష్ట్ర డిపో ఏర్పాటుపై మౌనం
- గతంలోనే కుదిరిన ఎంవోయూపైనా కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం
- ఫలితంగా అనేక ఇబ్బందులు పడుతున్న 4 రాష్ట్రాల ప్రయాణికులు
- ఇప్పటికే దూరప్రాంత సర్వీసులను తగ్గిస్తున్న ఆర్టీసీ అధికారులు
- బస్సుల సంఖ్య కుదింపుతో ప్రయాణికులకు పెరుగుతున్న భారం

భద్రాచలం బస్టాండ్ ప్రాంగణం(ఫైల్)

భద్రాచలం, డిసెంబర్ 23 : ప్రజలు అష్టకష్టాలు పడ్డా పర్వాలేదు గానీ.. గత కేసీఆర్ సర్కారుకు మాత్రం క్రెడిట్ దక్కకూడదన్న ధోరణిలో పాలన సాగిస్తోంది ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం. ప్రజోపయోగ పనులపై కేసీఆర్ జాడ కూడా ఉండకూడదన్న అక్కసుతో వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగానే కేసీఆర్ ఆనవాళ్లు చెరుపుకుంటూ వస్తున్నామంటున్న ప్రస్తుత కాంగ్రెస్ పాలకులు.. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన పనులను కూడా పక్కన పడేస్తున్నారు. ఈ క్రమంలోనే నాలుగు రాష్ట్రాల ప్రజలకు, ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేలా గత కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను నీరుగార్చుతున్నారు. వైద్యం, ఉపాధి, రవాణా వంటి అతి ముఖ్యమైన అంశాల్లో నాలుగు రాష్ట్రాల ప్రజలకు మూలస్తంభంగా ఉన్న తెలంగాణలోని భద్రాచలాన్ని మూలన పడేస్తున్నారు. కేసీఆర్ మీద ఉన్న కక్షతో ప్రజలను, ప్రయాణికులను కష్టాలపాలు చేస్తున్నారు.

భద్రాచలంలో ఆర్టీసీ అంతర్ రాష్ట్ర డిపో ఏర్పాటు కోసం నాలుగు రాష్ట్రాల ప్రజలు, ప్రయాణికులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారు. ఈ ఇబ్బందులను గుర్తించిన తెలంగాణలోని అప్పటి కేసీఆర్ ప్రభుత్వం.. ఒడిశా రాష్ట్ర ఆర్టీసీతో ఒప్పందం కుదుర్చుకుంది. అప్పటి తెలంగాణ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఎండీ సజ్జనార్‌లు ఒడిశా ఆర్టీసీ ఉన్నతాధికారులు ఎంవోయూ పత్రాలు మార్చుకున్నారు. ఆ తరువాత తెలంగాణలో ప్రభుత్వం మారడంతో ఒప్పందానికి బ్రేక్ పడింది. తరువాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. గత కేసీఆర్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను పక్కకు పెట్టింది.

దీంతో నాలుగు రాష్ట్రాల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నాలుగు రాష్ట్రాలకు అనుసంధానంగా..

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రగిరిలోని భద్రాచలం బస్టాండ్ తెలంగాణతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కేంద్ర బిందువుగా ఉంది. నాలుగు రాష్ట్రాలకు అనుసంధానంగా బస్సు సేవలను అందిస్తూ ప్రయాణికులకు చేరువైంది. ఏటా ముక్కోటి, శ్రీరామనవమి ఉత్సవాల సమయంలో భద్రాద్రికి వచ్చి వెళ్లే భక్తులకు సేవలందిస్తోంది. ఇక ఆయా రాష్ట్రాల్లోని ఏజెన్సీ ప్రాంత గిరిజనులు వైద్యసేవలు, ఇతర అవసరాలకు భద్రాచలమే ప్రధానం కావడంతో ఆయా రాష్ట్రాల నుంచి బస్సుల రాకపోకలు అధికం, అనివార్యం అయ్యాయి. అయినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వ చొరవ లేకపోవడం, సరైన సర్వీసులు రాకపోవడం వంటి కారణాలతో అంతర్రాష్ట్ర డిపో గుర్తింపు అంశం.. ఆయా రాష్ట్రాల ప్రజల కలగానే మిగిలిపోయింది. దీంతో నాలుగు రాష్ట్రాల ప్రయాణికులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. వీరి ఇబ్బందులను ఆసరా చేసుకుంటున్న ప్రైవేటు బస్సుల యజమానులు తెలంగాణ ఆర్టీసీ ఆదాయాన్ని కొల్లగొడుతున్నారు.

సర్వీసులు తగ్గిస్తూ..

భద్రాచలం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే సర్వీసులను క్రమంగా తగ్గిస్తుండడంతో ప్రగతి రథచక్రాలు ప్రయాణికులకు దూరమవుతున్నాయి. భద్రాచలం మద్రాసుకు గతంలో ఉన్న సర్వీసును రద్దు చేశారు. బెంగళూరుకు బస్సుల సంఖ్యను పెంచాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నా స్పందన లేదు. మరోపక్క హైదరాబాద్‌కు ఇటీవల ఏసీ స్లీపర్ బస్సులను ప్రవేశపెట్టినా ప్రయాణికుల రద్దీకి తగిన సంఖ్యలో సర్వీసులు ఉండడంలేదు. భద్రాచలం-హైదరాబాద్ సర్వీసులను సైతం చాలావరకు కుదించారు. హైదరాబాద్‌లో మెట్రో రైలుకు ఆదరణ పెరిగిందనే కారణంతో కేపీహెచ్‌బీ, బీహెచ్‌ఈఎల్, ఈసీఐఎల్ వరకు నడిపే బస్సులను ఎంజీబీఎస్ వరకే పరిమితం చేశారు.

కేసీఆర్‌పై కోపం.. ప్రజలకు శాపం..

అంతర్రాష్ట్ర డిపో ఏర్పాటు విషయంలో ముందుండి చొరవ తీసుకోవాల్సిన తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యం వీడడం లేదు. గత కేసీఆర్ ప్రభుత్వ పాలనలో చేసుకున్న ఒప్పందాలపై ముందుకెళ్లడం లేదు. ఒకవేళ గత ప్రభుత్వ ఎంవోయూలను అమలు చేస్తే ఆ ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి చెందుతుందన్న కారణంతోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలుకు ముందడుగు వేయడం లేదని రాజకీయ విశ్లేషకులు ఆరోపిస్తున్నారు. కానీ.. గత కేసీఆర్ ప్రభుత్వంపై ఉన్న కోపంతో తమనెందుకు ఇబ్బందులు పాలు చేస్తున్నారంటూ ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. అందుకే గతంలో తెలంగాణ, ఒడిశా ఆర్టీసీ సంస్థలు చేసుకున్న ఒప్పందాలు కేవలం పత్రాలకే పరిమితమయ్యాయని ఆరోపిస్తున్నారు.

తెలంగాణ స్వరూపాన్ని మారుస్తామని చెప్పి.. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చారు

- అసలైన తెలంగాణ తల్లినే మనం గౌరవించుకోవాలి
- జడ్పీ, టీఎస్ సీడ్స్ మాజీ చైర్మన్లు లింగాల, కొండబాల
- బోనకల్లులో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం


తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న కొండబాల, లింగాల

బోనకల్లు, డిసెంబర్ 23: తెలంగాణ రాష్ట్ర స్వరూపాన్ని మారుస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులు.. చివరికి తెలంగాణ తల్లి విగ్రహ స్వరూపాన్ని మార్చారని జడ్పీ, టీఎస్ సీడ్స్ మాజీ చైర్మన్లు లింగాల కమల్‌రాజు, కొండబాల కోటేశ్వరరావు విమర్శించారు. తెలంగాణ అస్తిత్వానికి, ఉద్యమానికి స్ఫూర్తిగా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చడం దుర్మార్గమని అన్నారు. అసలైన తెలంగాణ తల్లి విగ్రహాన్నే మనం గౌరవించుకుందామని పిలుపునిచ్చారు. బోనకల్లు మండలం నారాయణపురం గ్రామంలో సోమవారం పర్యటించిన వారు.. స్థానిక యువకులు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి అక్కడి తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యమం సమయంలో ఊరూరా తెలంగాణ తల్లి విగ్రహాలను నిర్మించుకున్నామని, ఆ విగ్రహాల స్ఫూర్తితో ఉవ్వెత్తున ఉద్యమించి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని వివరించారు. కానీ ఇప్పుడొచ్చిన కాంగ్రెస్ పాలకులు తమ స్వార్థం కోసం తెలంగాణ విగ్రహ రూపాన్ని మార్చారని విమర్శించారు. అలాగే, ఎన్నికల సమయంలో అనేక హామీలచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక వాటిల్లోని ఏ ఒక్క హామీనీ అమలుచేయలేకపోయిందని దుయ్యబట్టారు. ఇలాంటి ప్రభుత్వాన్ని గద్దె దించి కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు బంధం శ్రీనివాసరావు, వేమూరి ప్రసాద్, కొండా, మోదుగుల నాగేశ్వరరావు, కాకాని శ్రీనివాసరావు, ఇటికాల శ్రీనివాసరావు, పారా ప్రసాద్, గద్దల వెంకటేశ్వరరావు, కనకయ్య, జెర్రిపోతుల రవీందర్, కొనకంచి నాగరాజు, కంచర్ల అచ్చయ్య, యనమద్ది శ్రీను, వల్లెబోయిన కొండ, చిట్టిమోదు శ్రీనివాసరావు, వీరబాబు, బాబు, రాధాకృష్ణ, రూబీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజనుల ప్రదర్శన, ధర్నా

ఎస్టీ సర్టిఫికెట్లు, పోడు పట్టాలు, త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్

భద్రాచలం పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న మాజీ ఎంపీ, ఆదివాసీ గిరిజనులు

భద్రాచలం, డిసెంబర్ 23 : జిల్లాలోని ఆదివాసీలందరికీ ఆంక్షలు లేకుండా షెడ్యూల్ తెగల కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని, సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతోపాటు త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో భద్రాచలం ఐటీడీఏ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. తొలుత పట్టణంలోని సీపీఎం పార్టీ కార్యాలయం నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ నాయకుడు, మాజీ ఎంపీ మిడియం బాబూరావు మాట్లాడుతూ జీవనోపాధి కోసం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి 50 ఏళ్లుగా దండకారణ్యంలో ఎలాంటి సౌకర్యాలు లేకున్నా జీవనం సాగిస్తున్న వలస ఆదివాసీల పట్ల ప్రభుత్వం సవతి తల్లి ప్రేమచూపుతున్నదని మండిపడ్డారు. వలస ఆదివాసీ గిరిజనులకు 2021 వరకు షెడ్యూల్ తెగల కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి.. ఇప్పుడు ఇవ్వకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తమ సమస్యలు పరిష్కరించని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐటీడీఏ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సున్నం గంగ, మడివి రమేశ్, గౌరి నాగేశ్వరరావు, కొమరం కాంతారావు, గోవర్ధన్, కారం నరేశ్, కొమరం చంటి, దొడ్డి హరి, నాగవర్మ, బాబూరావు, లక్ష్మయ్య, పొడియం పవన్, సీఐటీయూ నాయకులు ఎంబీ నర్సారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గడ్డం స్వామి, కణితి సీత, కూసం లక్ష్మయ్య పాల్గొన్నారు.

త్వరితగతిన అర్జీలు పరిష్కరించండి

గ్రీవెన్స్ డేలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్

విజ్ఞప్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 23 : ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించిన ఆయన.. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని సైనిక్‌పురి రామాంజనేయనగర్ కాలనీవాసులు తమ కాలనీలో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందించారు. అశ్వాపురం మండలం మల్లెలమడుగు గ్రామానికి చెందిన బేతంపూడి పూర్ణ, టేకులపల్లి మండల బద్దుతండాకు చెందిన కత్తుల సురేశ్, చుంచుపల్లి మండలం త్రీ ఇంక్లైన్‌కు చెందిన ధనలక్ష్మి తమ తమ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా 'పూబెల్లి'

కలెక్టర్ జితేశ్ వి పాటిల్

చర్చా వేదికలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 23 : పూబెల్లి గ్రామాన్ని పర్యటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. పూబెల్లి గ్రామాన్ని సోమవారం సందర్శించిన కలెక్టర్ గ్రామస్తులతో పర్యాటక అంశంపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటక కేంద్రంగా పూబెల్లి అభివృద్ధి చెందితే ఇక్కడి యువతకు అనేక విధాలుగా జీవనోపాధి లభిస్తుందన్నారు. చెరువులో బోటింగ్‌తోపాటు సైక్లింగ్, కొండ ఎక్కేందుకు బెట్టింగ్ వంటివి సమకూరుస్తామని తెలిపారు. పర్యాటకులకు మంచి భోజనంతోపాటు రుచికరమైన ఆహారం అందించే విధంగా గ్రామస్తులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అధికారులు పర్యాటక కేంద్రంపై నివేదికలు తయారు చేసి వారం రోజుల్లోగా సమర్పించాలని ఆదేశించారు. జనవరి తర్వాత అన్ని హంగులతో పూబెల్లి గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. అయితే కలెక్టర్‌కు తమవంతు పూర్తి సహకారం అందిస్తామని గ్రామస్తులు తెలిపారు. అనంతరం తమ పొలాల్లో బోర్లు వేసుకుంటే అటవీ శాఖ అధికారులు అడ్డు తగులుతున్నారని, సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు విన్నవించారు. ఫారెస్టు అధికారులతో మాట్లాడుతానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో ధన్‌సింగ్, తహసీల్దార్ రవికుమార్, డీటీ కిశోర్, ఏపీఎం దుర్గారావు, ఎంపీవో చిరంజీవి, ఆర్ఐ ఆదినారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఆర్టీలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

రిలే దీక్షలకు మద్దతు తెలిపిన ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

భద్రాచలంలో మాజీ ఎమ్మెల్యే హరిప్రియకు వినతిపత్రం ఇస్తున్న సీఆర్టీలు

భద్రాచలం, డిసెంబర్ 23 : ఎన్నికల సమయంలో సీఆర్టీలకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే నిలబెట్టుకోవాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్ డిమాండ్ చేశారు. తమ అపరిష్కృత డిమాండ్లు పరిష్కరించాలని సీఆర్టీలు భద్రాచలం ఐటీడీఏ వద్ద నాలుగు రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని సోమవారం ఆమె సందర్శించి మద్దతు పలికారు. ఈ సందర్భంగా హరిప్రియానాయక్ మాట్లాడుతూ సీఆర్టీల సమస్యల పరిష్కారం గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు వారిని రేవంత్‌రెడ్డి రెగ్యులర్ చేస్తామని నమ్మించి.. ఇప్పుడు ఆ సమస్యను గాలికొదిలేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గుగులోతు రవికుమార్, కోశాధికారి వెంకట్, ఐటీడీఏ ఇన్‌చార్జి రాజేశ్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సక్రాం, వీరన్న, రాష్ట్ర నాయకులు హరిరాం, సర్వేష్, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో 'టీబీజీకేఎస్' ఘన విజయం

సొసైటీ డైరెక్టర్‌గా వేముల శైలేష్ కిరణ్ గెలుపు

కొత్తగూడెంలో సంబురాలు చేసుకుంటున్న టీబీజీకేఎస్ శ్రేణులు

సొసైటీ డైరెక్టర్‌గా ఎన్నికైన శైలేష్ కిరణ్

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 23 : సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని సెంట్రల్ వర్క్‌షాప్‌లో సోమవారం నిర్వహించిన క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో టీబీజీకేఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన వేముల శైలేష్ కిరణ్ సొసైటీ డైరెక్టర్‌గా ఘన విజయం సాధించారు. మొత్తం 59 ఓట్లకు.. 49 ఓట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచి గులాబీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కూసన వీరభద్రం, విజయ్‌కుమార్, కంచర్ల శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు ఆయనను ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. శైలేష్ కిరణ్ గెలుపుతో రంగులు చల్లుకొని సంబురాలు జరుపుకున్నారు. అనంతరం ఆయనకు స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో సూరజ్, శివకుమార్, ఆమరేందర్, అశోక్, విజయభాస్కర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార రంగంలో దూసుకెళ్తున్నాం..

- యంత్రాల సామర్థ్యాన్ని 20 గంటలు వినియోగించాలి
- కార్మికుల సమష్టి కృషితో 22 ఏళ్లుగా లాభాల బాటలో సంస్థ
- సింగరేణి డే వేడుకల్లో సీఎండీ బలరాం

సింగరేణి పతాకావిష్కరణ చేసి గౌరవ వందనం చేస్తున్న సీఎండీ బలరాం

బెలూన్లు ఎగురవేస్తున్న సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 23 : బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతతో సరిపెట్టుకోకుండా వ్యాపార రంగంలో కూడా దూసుకుపోతూ ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నామని సింగరేణి సీఎండీ బలరాం అన్నారు. సింగరేణి డే సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం హెడ్డాఫీసు నుంచి సోమవారం ఉదయం ప్రకాశం స్టేడియం వరకు 2కే రన్ నిర్వహించారు. అనంతరం సింగరేణి పతాకాన్ని ఆవిష్కరించి స్టాళ్లను ప్రారంభించారు. రాత్రి కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగిన సింగరేణి డే సెంట్రల్ ఫంక్షన్ వేడుకల్లో ముఖ్యఅతిథిగా సీఎండీ బలరాం పాల్గొని మాట్లాడారు. నష్టాల్లో కూరుకుపోయిన సింగరేణి సంస్థను కార్మికులు, అధికారులు సమష్టి కృషితో 22 ఏళ్లుగా లాభాల బాటలో నడిపిస్తున్నారన్నారు. ప్రైవేట్ కంపెనీల పోటీని తట్టుకొని మార్కెట్‌లో మనుగడ సాగించాలంటే ప్రతీ కార్మికుడు 8 గంటల సమయాన్ని పూర్తిస్థాయిలో వినియోగించాలన్నారు. యంత్రాల సామర్థ్యాన్ని కూడా 20 గంటలు వినియోగిస్తే ఉత్పత్తి ఖర్చు తగ్గి లాభాలు పెరిగే అవకాశం ఉందన్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పడంతోపాటు మరో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. వ్యాపార విస్తరణలో భాగంగా త్వరలోనే లోయర్ మానేరు రిజర్వాయర్, మల్లన్నసాగర్ రిజర్వాయర్లపై ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు, సింగరేణిలోనే కాకుండా ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో కూడా సింగరేణి ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. రాజస్థాన్ రాష్ట్రంలో సోలార్, విండ్ పవర్ ప్లాంట్లను నిర్మించేందుకు, మణుగూరు ఏరియా పగిడేరు వద్ద 300 మెగావాట్ల జియో థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించి సంస్థ వ్యాపార విస్తరణలో మరింతగా దూసుకుపోతున్నామన్నారు. కారుణ్య ఉద్యోగ నియామకాల్లో భాగంగా డిపెండెంట్ల వయస్సు 35 నుంచి 40 ఏళ్లకు పెంచామని, సంస్థలో పలు ప్రైవేట్ సంస్థలను 80 శాతం ఉద్యోగాలు స్థానికులకే కేటాయించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. నైనీ బ్లాక్‌తోపాటు కొత్తగూడెం వీకే వోసీ, ఇల్లెందు రొంపేడు ఓసీ, రామగుండం కోల్ మైన్స్, గోలేటీ ఓసీల నుంచి కూడా ఉత్పత్తి ప్రారంభం కానున్నదని తెలిపారు. 2030 నాటికి వంద మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు, డైరెక్టర్లు(పా, పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ ఈఅండ్ఎం, ఆపరేషన్స్ సత్యనారాయణరావు, జీఎంలు కవితానాయుడు, శ్రీనివాసరావు, సూర్యనారాయణరావు, జీఎం సెక్యూరిటీ, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.